క్లుప్తంగా

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టొద్దు



కొలతలు వేస్తున్న అధికారులు

మద్దికెర: పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని, అలాగే ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తామని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, కార్యదర్శి శ్రీహరి హెచ్చరించారు. శనివారం స్థానిక ప్రధానబజారు సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద జిన్నుకు సంబంధించిన స్థలాన్ని కొలతలు వేసి హద్దులు వేశారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నిర్మాణాలకు తప్పనిసరిగా పంచాయతీ కొలతలు వేసి అనుమతి తీసుకున్న అనంతరం కట్టడాలు చేయాలన్నారు. నిర్మాణాలకు సంబంధించి పంచాయతీ సభ్యుల తీర్మానం మేరకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు.

కళాశాల విద్యార్థుల ఘర్షణ

గోనెగండ్ల : మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద ఉన్న జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల మధ్య శనివారం ఘర్షణ చోటుచేసుకుంది. ఇరు కళాశాలల విద్యార్థులు ఒకరినొకరు దూషించుకున్నారు. ఓ విద్యార్థిని, విద్యార్థి మధ్య జరిగిన ఘటన ఈ గొడవకు కారణమని తెలిసింది. విషయం తెలుసుకున్న లెక్చరర్లు విద్యార్థులను కళాశాలలోకి తీసుకెళ్లారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

పంపిణీకి యూరియా సిద్ధం

హొళగుంద: మండల కేంద్రంలోని నాలుగు సచివాలయాలతో పాటు వందవాగిలి, పెద్దగోనెహాళ్ రైతు భరోసా కేంద్రాల్లో యూరియా పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఏఓ ఆనంద్ లోకదళ్ శనివారం తెలిపారు. ఒక్కో సచివాలయానికి 280 బస్తాల ప్రకారంగా మొత్తం ఐదు సచివాలయాలకు 1,400 బస్తాలు వచ్చినట్లు వెల్లడించారు. కార్యాలయంలో రిజిష్టర్ చేసుకున్న రైతులకు ఎమ్మార్పీకే యూరియాను అందజేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు వీఏఏలను సంప్రదించాలన్నారు.

రైతులకు సకాలంలో విద్యుత్ కనెక్షన్లు

కృష్ణగిరి: సీనియారిటీ ప్రకారం అర్హులైన రైతులందరికీ విద్యుత్ కనెక్షన్లు సకాలంలో అందజేస్తున్నామని ట్రాన్స్ కో ఏఈ మద్దిలేటి తెలిపారు. కృష్ణగిరిలోని సబ్‌స్టేషన్‌లో శనివారం ఆయన రైతులతో మాట్లాడారు. 2019 నుంచి 2023 మార్చి వరకు పెండింగ్‌లో ఉన్న రైతులందరికీ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. 2023 ఏప్రిల్‌లో డీడీలు కట్టిన వారికి కూడా ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయన్నారు. వీటిని సీనియారిటీ జాబితా ఆధారంగా అందజేస్తామని చెప్పారు. ఇక నుంచి దరఖాస్తు చేసుకున్న రెండు నెలల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. దాదాపుగా 100కుపైగా దరఖాస్తులు రాగా ఇప్పటికే సగానికిపైగా రైతులకు అందజేశామని తెలియజేశారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాముడు ఉన్నారు.

నెరవేరిన 20ఏళ్ల కల



కుళాయి ప్రారంభిస్తున్న బొమ్మన రవిరెడ్డి

వెల్దుర్తి: పట్టణంలోని 15వ వార్డు కొండపేట వాసుల 20 ఏళ్ల కల నెరవేరింది. కాలనీలోని దర్గా వెళ్లే దారిలోని పదుల సంఖ్యలో కుటుంబాలకు ఏళ్లుగా తాగునీటి సౌకర్యం లేదు. దీంతో అష్టకష్టాలు పడేవారు. వారి కష్టాలు గుర్తించిన బొమ్మన రవిరెడ్డి కాలనీలో ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేయించారు. శనివారం పూజా కార్యక్రమాలు నిర్వహించి తాగునీటి సరఫరాను ప్రారంభించారు. దీంతో కాలనీ వాసులు మండల కన్వీనర్‌తో పాటు పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడును సత్కరించారు.

ఆర్థిక సాయం

పత్తికొండరూరల్: స్థానిక చింతకాయల వీధిలో బుడుసు హనుమంతమ్మ(78)శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి దహన సంస్కారాలకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే వీకే ఆదినారాయణరెడ్డి కాలనీలో ఇటీవల మృతి చెందిన లింగరాజు భార్య మహేశ్వరికి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని సేవాదళ్ సభ్యుల ద్వారా అందజేశారు.

వెల్దుర్తి విద్యార్థికి ప్రశంస



ప్రశంస పత్రం అందుకుంటున్న నితీష్‌కుమార్

వెల్దుర్తి: తిరుపతిలోని శ్రీ విద్యానికేతన్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న వెల్దుర్తికి చెందిన విద్యార్థి బెస్త నితీష్‌కుమార్ సీఎస్‌ఈ గ్రూప్‌లో టాపర్‌గా నిలిచాడు. శనివారం కళాశాల వార్షికోత్సవం నిర్వహణలో భాగంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నాడు. అలాగే కళాశాల యాజమాన్యం ప్రముఖ నటులు మోహన్‌బాబు, మంచు విష్ణు అభినందించారు.

వర్షాకాలం.. పశు వ్యాధులపై అప్రమత్తం

- వర్షాలకు పశువుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం
- జాగ్రత్తలు పాటిస్తే నివారించవచ్చంటున్న పశువైద్యాధికారులు
- పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు టీకాలు



మేత మేస్తున్న గొర్రెల మంద

ఎమ్మిగనూరు: వర్షాకాలం.. అందులోనూ పదిరోజులుగా కురిసిన భారీ వర్షాలతో గ్రామాల్లో నీరు చేరి బురదమయం అయ్యాయి. మనుషులతోపాటు పశువులకు అనేక వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. గొర్రెలు, మేకల్లో కూడా వైరస్ వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో పాడి పెంపకందారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులబారి నుంచి జీవాలను రక్షించవచ్చని ఎమ్మిగనూరు పశుసంవర్ధకశాఖ ఏడీ సుబ్రహ్మణ్యం ఆచారి చెబుతున్నారు.

పశువులకు వ్యాక్సిన్లు

జిల్లాలో ఆవులు 2,36లక్షలు, గేదెలు 1.27లక్షల, మేకలు 3.05లక్షలు ,గొర్రెలు 11.03లక్షలు, కోళ్లు 5.85 లక్షలు ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. పశుసంవర్ధకశాఖ ఇటీవల పశువుల్లో వచ్చే జబ్బువ్యాధి, గొర్రెలకు సోకే చిటుక వ్యాధులకు టీకాలు వేశారు. అలాగే వర్షాకాలంలో వచ్చే గాలికుంటవ్యాధి నివారణకు వ్యాక్సిన్లు వేస్తున్నారు.

గాలికుంట వ్యాధి.. నివారణ

ఇది వైరస్‌వల్ల కలిగే వ్యాధి. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తదితర జీవాల్లో కనిపించే వ్యాధి. వ్యాధి లక్షణాలను పరిశీలిస్తే నోటిలో, కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడతాయి. జ్వరం ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి సోకిన పాడి పశువులు నాలుగు నెలల్లోనే ఒట్టిపోతాయి. నివారణకు బోరిక్ గ్లిజరిన్ పేస్టును నోటిలో పూయాలి. పీపీ ద్రావణంతో కాలిగిట్టల మధ్య బాగా కడగాలి. యాంటిబయాటిక్ మందులు, లివర్ టానిక్‌లు వాడాలి. ప్రతిఏటా వర్షాకాలానికి ముందుగానే వాక్సినేషన్ చేయించాలి.

నేలమచ్చతెగులు (చిటుకవ్యాధి)

చిటుక వ్యాధి బ్యాక్టీరియా వల్ల వ్యాప్తి చెందుతుంది. గొర్రెలకు ఎక్కువగా ఈ వ్యాధి సోకుతుంది. వ్యాధి లక్షణాలు ఉన్న జీవాలు తూలుతూ నడుస్తాయి. ఉన్నట్లుండి గాలిలో ఎగిరి వెనువెంటనే (చిటుకలో) చనిపోతూ ఉంటాయి. అందువల్ల దీన్ని చిటుకవ్యాధిగా పిలుస్తారు. ఒక మందలో పదికిపైగా జీవాలు చనిపోతే చిటుకవ్యాధి సోకినట్లు నిర్ధారిస్తారు. మందలో నీరసంగా ఉన్న గొర్రెలను వేరుగా ఉంచాలి. వ్యాధి నివారణకు పెన్సిలిన్ వాక్సిన్ వేయాలి. వ్యాధి సోకనివాటికి కూడా వాక్సిన్ వేయించాలి.

నీలినాలుక వ్యాధి

గొర్రెలు, మేకల్లో ఎక్కువగా నీలి కుంటవ్యాధి వస్తుంది. ఈ వ్యాధి వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి సోకిన జీవాల్లో జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నోటి నుంచి సొంగ కారుస్తాయి. గిట్టలకు పుండ్లు ఏర్పడుతాయి. ఈ వ్యాధి సోకిన జీవాలు ఆహారం తీసుకోవు. దానివల్ల బాగా నీరసించి పోతాయి. ఈ వ్యాధి సోకిన జీవాలు మంద నుంచి అవే వేరుపడతాయి. ఈ వ్యాధి నివారణకు యాంటిబయాటిక్ మందులు, లివర్ టానిక్‌లు వాడాలి. ఆరోగ్యంగా ఉన్న జీవాల నుంచి వీటిని వేరుచేసి చికిత్స అందించాలి.

గొంతువ్యాధి

బ్యాక్టీరియా వల్ల గొంతువ్యాధి వ్యాప్తి చెందుతుంది. అన్ని వయస్సుల ఆవులు, గెదెల్లో ఇది విస్తరిస్తుంది. వ్యాధి లక్షణాల కొస్తే 105, 106 డిగ్రీల జ్వరం ఉంటుంది. నోటి నుంచి నురుగు (సొంగ) కారుతూ ఉంటుంది. నోటితోనే ఎక్కువగా శ్వాస తీసుకుంటాయి. మేత మేయడానికి గొంతులో వాపు అడ్డుగా ఉంటుంది. నివారణకు సల్ఫాడిమిడిన్ మందులను వాడాలి. నాలుగు నెలలు దాటిన పశువులకు వ్యాక్సిన్ కచ్చితంగా వేయించాలి.

వర్షాకాలం.. తీసుకోవలసిన జాగ్రత్తలు

- దాణా అందుబాటులో ఉంచుకోవాలి. తడిసిన దాణా పెట్టకూడదు.
- పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఎండుగడ్డి తడవకుండా ఏర్పాట్లు చేసుకోవాలి.
- మేతను అధికంగా పశువులకు పెట్టకూడదు. అన్నింటినీ ఒకే గాదెకు కట్టకూడదు.
- అధిక వర్షాలు, వరదల వల్ల జంతువులు చనిపోతే పూడ్చిపెట్టాలి.
- యాంటిబయాటిక్స్, పెయిన్ కిల్లర్ మందులను షెడ్లలో అందుబాటులో ఉంచుకోవాలి.
- పశువులకు మేత, తాగునీరు సమృద్ధిగా ఉంచుకోవాలి.
- అత్యవసర సేవలకు టోల్‌ఫ్రీ నెంబర్ 1962కు కాల్ చేయాలి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలం నేపథ్యంలో పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి. జీవాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. వ్యాధులు సోకక ముందే జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. ముందస్తుగా టీకాలు వేయిస్తే వ్యాధులను నివారించవచ్చు. జీవాలకు వ్యాధులు సోకితే పశువైద్యులను సంప్రదించాలి.

– సుబ్రహ్మణ్యం ఆచారి, ఎమ్మిగనూరు పశుసంవర్ధకశాఖ ఏడీ

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు



శభాష్‌పురంలో కొలువుదీరిన పీర్లు

తుగ్గలి : మండల పరిధిలోని శభాష్‌పురంలో మొహర్రం సందడి నెలకొంది. సమస్యాత్మక గ్రామం కావడంతో పోలీసులు ఆలస్యంగా పండుగకు అనుమతి ఇచ్చారు. శనివారం పెద్ద సరిగెత్తు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు పీర్ల చావిడికీ వెళ్లి పీర్లకు చక్కెర చదివింపులు ఇచ్చి, బంగారం, వెండి గొడుగులు, ఆభరణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

ఘనంగా చిన్న పీర్ల పండుగ

కృష్ణగిరి: మండల పరిధిలోని బోయబొంతిరాళ్ల గ్రామంలో చిన్న పీర్ల పండుగను గ్రామస్తులు జరుపుకుంటున్నారు. పండుగలో భాగంగా శనివారం చిన్న సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ఆదివారం పగలు సరిగెత్తు, సోమవారం పెద్ద సరిగెత్తు జరుపుకుని మంగళవారం పీర్లను ఏటికి పంపనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఎస్ఐ సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కళ్ల కలకపై అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల: కళ్ల కలక పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కార్తిక్ సూచించారు. శనివారం మండలంలోని తిప్పనూరు గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో కండ్ల కలకపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధి వ్యాపించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పార్లపల్లె గ్రామ టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని పార్లపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శనివారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచ్ నారాయణ, న్యాయవాది జయన్న ఆధ్వర్యంలో కర్రెగెడ్డెన్న, ఆనంద్, ఏసన్న, చిన్న బతకన్న, న్యాయవాది ఎంసీ రామన్న, ఈర్మియ, ఏసురాజులతో పాటు 200ల మంది పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై తాము వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే ఎన్నో ప్రయోజనాలు, లాభాలుంటాయని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో షెడ్యూల్ కులాలకు చెందిన ప్రకృతి వ్యవసాయం చేసే 57 మంది రైతులకు రూ.10వేల విలువైన పలు రకాల విత్తనాలను ఎస్సీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాసకుమార్, ఎంపీపీ కేశన్నలతో కలిసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి పంటలను సేంద్రియ పద్ధతిలో పండించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ పీడీ చంద్రశేఖర్, అధికారులు జగదీష్, అబ్దుల్‌బాషా, ఏఓ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- మామిళ్లకుంటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి : ప్రభుత్వం ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందజేస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం మామిళ్లకుంటలో పార్టీ నాయకులు, అధికారులు, వలంటీర్లతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించారు. అర్హులెవరికైనా పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి సీఎం ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు చేరుస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీ వారే దోపిడీ చేశారని ఆరోపించారు. ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ నెరవేరని హామీలు ఇస్తున్నారన్నారు. ప్రజలు గమనించి మంచి చేసిన తమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథరెడ్డి, నాగేష్, మోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, హనుమంతరెడ్డి, సత్యప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

10న నులిపురుగు నివారణ మందుల పంపిణీ

ఆలూరు రూరల్: ఈ నెల 10వ తేదీన 1–19 సంవత్సరాల వయసు ఉన్న వారికి నులిపురుగు నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ అల్లబకాష్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలం ఎంఈఓ–2 చిరంజీవి రెడ్డి, మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి సమక్షంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు నులి పురుగు మాత్రలు పంపిణీ చేశారు. సచివాలయాల వారీగా 19 ఏళ్ల లోపు వయసున్న పిల్లలకు నులిపురుగు మందులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. డాక్టర్ మారుతి మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆశావర్కర్ల సమక్షంలో మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు వేయించాలన్నారు. 10వ తేదీ అదుబాటులో ఉండని చిన్న పిల్లలు యువతీ,యువకులకు ఈ నెల 17న మాత్రలు పంపిణీ చేస్తామన్నారు.

నులిపురుగు నివారణకు ఆల్బెండజోల్

మద్దికెర : చిన్నారుల్లో రక్తహీనత నివారించడానికి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి నగేష ఎంఈఓ రంగస్వామి అన్నారు. శనివారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, హెచ్‌ఎంలు దేవేంద్రప్ప, ఫరూక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి : నులి పురుగుల నివారణకు 0–19 ఏళ్ల లోపు వయస్సు వారందరితో అల్బెండజోల్ మాత్రలు మింగించాలని పగిడిరాయి, తుగ్గలి వైద్యాధికారులు హరిత, ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 10, 17వ తేదీల్లో నులి పురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ–2 రామవెంకటేశ్వర్లుతో కలిసి ఆవిష్కరించారు.

హొళగుంద: ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్, ఐరన్ మాత్రలను పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ, ఎంఈఓలు జగన్నాథం, సత్యనారాయణ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. శనివారం హెచ్‌ఎంలకు ఆల్బెండజల్, ఐరన్ మాత్రల పంపిణీపై పీహెచ్‌సీ డాక్టర్ బిందుమాధవి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతి



పెద్ద ఈరన్న(ఫైల్)

తుగ్గలి : మండల పరిధిలోని రాతన ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెద్ద ఈరన్న (68) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ శనివారం స్వగృహంలోనే మృతి చెందారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. పలు పార్టీల నాయకులు ఈరన్న భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డుకు మరమ్మతులు

హొళగుంద: చాలా కాలంగా ముళ్లకంపలు పెరిగి, మోకాలోతు గుంతలు పడి నడవ లేని స్థితిలో ఉన్న లింగంపల్లి–ఎల్లార్తి రస్తాను శనివారం గ్రామానికి చెందిన రైతులు బాగు చేయించుకున్నారు. స్థానిక రైతులందరూ చందాలు వేసుకుని ముళ్లకంపలు తొలగించి, రోడ్డును చదును చేయించారు. కార్యక్రమంలో రైతులు మనుమేష్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంలో రాణించాలి



పెరటికోళ్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

దేవనకొండ : పెరటికోళ్ల పెంపకంలో రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ సూచించారు. శనివారం ఆయన మండలానికి మంజూరైన వంద యూనిట్లు పెరటి కోళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గా ఆయన మాట్లాడుతూ ఒక యూనిట్ ధర రూ.3250 ఉండగా, ఇందులో 8 పెట్టెలు, మూడు పుంజులు ఉంటాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, ఏఓ సురేష్, ఏపీఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఓటర్ల సర్వే పక్కగా చేయండి

నందవరం : గ్రామాల్లో బీఎల్‌ఓలు ఓటర్ల సర్వే పక్కగా చేయాలని తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. శనివారం మండల కేంద్రంలో 32, 33 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, వీఆర్వోలు పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

నందవరం : ప్రజా పంపిణీలో ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని తహసీల్దార్ నిత్యానందరాజు ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో రేషన్ సరుకుల పంపిణీని తహసీల్దార్ తనిఖీ చేశారు. ప్రజా పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటరు సర్వేకు సహకరించండి

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాలలో జరుగుతున్న ఓటరు సర్వేకు ప్రజలు సహకరించి పూర్తి వివరాలు అందజేయాలని తహసీల్దార్ నాగభూషణం కోరారు. శనివారం మాట్లాడుతూ మండలంలో 34 పోలింగ్ కేంద్రాలకు 34 మంది పోలింగ్ బూత్ అధికారులకు నియమించి ఇంటింటి సర్వే చేస్తున్నారన్నారు. ఈనెల 21 వతేదీ వరకు సర్వే కొనసాగుతుందన్నారు.

బీసీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

హొళగుంద : ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిసే శివన్న ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా వందవాగిలి మల్లికార్జున, అధ్యక్షుడిగా పెద్యాట నాగప్ప, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, చంద్ర, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కార్యదర్శులుగా శివన్న, వెంకోబ ఎన్నికయ్యారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెర్వు గ్రామ శివారులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో మద్యం అమ్ముతున్నట్లు సమాచారంతో శనివారం దాడి చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ దాడిలో అదే గ్రామానికి చెందిన జటంగి మహేష్, ఆగవేళి గ్రామానికి చెందిన ఎరుకల కృష్ణల నుంచి 90 ఎంఎల్ 56 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడండి

చిప్పగిరి: మండలకేంద్రంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ డీఈ సుధాకర్‌ను జెడ్పీటీసీ విరుపాక్షి కోరారు. గ్రామంలోని పలుకాలనీల్లో లో ఓల్టేజీ సమస్య ఉండడంతో శనివారం విద్యుత్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వారికి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఈ నాగేంద్ర ప్రసాద్, ఏఈ ఉలిగన్న తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

తుగ్గలి : పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది శివశంకర రెడ్డి, అనూరాధ, రామాంజినమ్మ, మున్నేనాయక్, గోపాల్ బదిలీ అయ్యారు. శనివారం పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులను వైఎస్సార్‌సీపీ నాయకుడు సుధాకరరెడ్డి, హెచ్‌ఎం నరేంద్ర, పీఎంసీ చైర్మన్ నాగరాజు ఘనంగా సన్మానించారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

కృష్ణగిరి: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని మాదాపురం, అమకతాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఆమె తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, విజయలక్ష్మి, చంద్రావతి, ప్రేమలత పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

నందవరం : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీఓ దశరథ రామయ్య ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో బడి ఈడు పిల్లల రీ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. మండలంలో 180 మంది పిల్లలు బడి బయట ఉన్నారని తెలిపారు. వారిని తప్పని సరిగా బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఎంఈఓలు సుదర్శన్‌రెడ్డి, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- నేలతలమర్రి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలికి పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

దేవనకొండ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం లభించిందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం మండలంలోని నేలతలమర్రి గ్రామంలో ఎంపీడీఓ గౌరీదేవి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి పనులకై రూ.10.97 కోట్లు మంజూరు

నేలతలమర్రి గ్రామంలో అభివృద్ధి పనులకై రూ.10.97 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలను చేపడతామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పవన్‌కల్యాణ్ గాలి మాటలు ప్రజలు నమ్మరు

పవన్‌కల్యాణ్ గాలి మాటలను ప్రజలు నమ్మరని, ఏపీలో వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే అన్నారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడు డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ పార్టీలను ప్రజలు చిత్తుగా ఓడించి, జగనన్నను మరోసారి అధికారంలోకి తీసుకొస్తారని ధీమా వ్యక్తం చేశారు.

వలంటీర్‌కు అభినందనలు

గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న రామదుర్గం విమల సేవలు ఎనలేనివని మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆమె పనితీరు, విధుల్లో చూపిస్తున్న చురుకుదనానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నారాయణస్వామి, జెడ్పీటీసీ రామకృష్ణ, మండల కన్వీనర్ మల్లికార్జున, మండల కో–కన్వీనర్ కబీర్‌దాస్, రాజారెడ్డి, సహదేవుడు, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



చిప్పగిరిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ జూటూరు హేమలత

చిప్పగిరి: టేక్ హోమ్ రేషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఎంపీపీ జూటూరు హేమలత పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషకాహార లోపం తలెత్తకుండా ప్రభుత్వం సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. అంతే కాకుండా వారి సౌకర్యార్థం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం ద్వారా వాటి ఇంటి వద్దకే సరుకులను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీవీ కొండయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ నగరంలో శనివారం జరిగిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ మహేశ్వరి, గోవర్ధనగిరి వైద్యాధికారి నవీన్ కుమార్‌తో కలిసి పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలకు అందించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 19వ వార్డు సచివాలయ పరిధిలోని 14వ అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణిలకు, బాలింతలకు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి ఈరమ్మ, అంగన్‌వాడీ టీచర్ శారద వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు.

హాలహర్వి : మండలంలోని విరుపాపురం గ్రామంలో సర్పంచ్ సిద్దమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రావతి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందించారు.

సేవలే చిరకాలం గుర్తుంటాయి



సింగిల్‌విండో అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గోనెగండ్ల : ప్రజలకు చేసిన సేవలే చిరకాలం గుర్తుంటాయని వైస్ ఎంపీపీ అలువాల వెంకట్రామిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, మండల కన్వీనర్ దొరబాబు అన్నారు. గోనెగండ్ల సహకారం సంఘం అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్ రెడ్డి పదవీకాలం పూర్తయింది. శనివారం సహకారం సంఘం సీఈఓ చంద్రశేఖర్ అధ్యక్షతన స్థానిక సహకార సంఘం కార్యాలయంలో కాశీవిశ్వనాథ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిల్లిగుండ్ల నాగన్న, నాయుడు, తిక్కయ్యస్వామి, బావిగడ్డ ఈరన్న, నరసన్న ఆచారి తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే ముసాయిదా జాబితా ప్రచురణ

వెల్దుర్తి: మండల పరిధిలోని పుల్లగుమ్మి రెవెన్యూ పరిధిలో పూర్తయిన వైఎస్సార్ జగనన్న భూ రీసర్వేకు సంబంధించి ముసాయిదా జాబితాను తహసీల్దార్ శివరాముడు శనివారం ప్రచురించారు. ముసాయిదా వివరాలను సర్పంచ్ వెంకట లక్ష్మమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి ప్రజలకు విశదీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 1460.9 ఎకరాల భూ రీసర్వే పూర్తయిందన్నారు. ముసాయిదా జాబితాలో వివరాలపై వారం రోజుల పాటు లబ్ధిదారులకు అనుమానాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఫైనల్ జాబితా ప్రచురణ లోపు ప్రజలు రీసర్వే ప్రకారం తమ భూములు ఎక్కువ, తక్కువలు ఉన్నా వాటి పరిష్కారానికి తమ సచివాలయంలో అర్జీ రూపంలో సమర్పించాలని తెలిపారు. ఎంపీటీసీ నాగార్జున రెడ్డి, మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి, డీటీ ప్రసాద్‌రాజు, ఆర్ఐ మస్తాన్ పాల్గొన్నారు.

రీ సర్వేను అడ్డుకుంటే కఠిన చర్యలు

పత్తికొండ రూరల్ : భూముల రీ–సర్వేను అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దారు విష్ణుప్రసాద్ హెచ్చరించారు. చక్రాళ్ల గ్రామంలో సర్వేనెం 39లో అధికారులు చేపట్టిన రీసర్వేను గ్రామానికి చెందిన కొందరు అడ్డుకున్నారని రామాంజినేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం గ్రామానికి వెళ్లి రీసర్వే చేయించారు. ఈసర్వేవల్ల రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదని, అనవసరమైన అపోహలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నారాయణ, బీరప్ప, ఆర్ఐ లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

హాలహర్వి : మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 2022 మార్చి నుంచి 2023 మార్చి చివరి వరకు చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభను శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంతోని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో రికవరీ రూ.10,640, పెనాల్టీ రూ.35,500, రెక్టిఫికేషన్ రూ.6626, రీ ప్లాంటేషన్ రూ.55,227, డ్రాఫ్ట్ రూ.21,98,877, పీఆర్ రికవరీ రూ.85,042 రికవరీ అయినట్లు ఏపీడీ సలీంబాషా తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ పక్కీరప్ప, ఎఫ్‌ఎం ఆదెయ్య, సీడీ ఆదినారాయణ, ఏపీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.